వైభవంగా మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు

యాగశాలలో నిత్య పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు గురువారం ఉత్సవమూర్తులను తిరుమాఢవీధుల్లో ఊరేగించి యాగశాలలో ప్రవేశింపజేశారు. దేశ నలుమూలల నుంచి గోదావరి, పెన్‌గంగా, యమున, గంగ, ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం, సరయూ, గోమతి, నర్మదా, మంజీర, తాలిపేరు, హరిద్రా, కృష్ణా, తుంగభద్ర నదీ తీర్థాలను యజ్ఞశాలలోని కలశాలలో కలిపారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధన, మూర్తిమంత్ర హోమాలు, వారుణానువాక హోమం చేపట్టారు. ఆలయ శిఖరాలపై అలంకరించే కలశాలకు ఛాయాధివాస కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీజొన్నలగడ్డ సత్యశ్రీరాం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీతం, హైదరాబాద్‌కు చెందిన శ్రీవనజా ఉదయ్ బృందంచే కూచిపూడి నృత్యం, శ్రీలోహిత చలసాని బృందం చేపట్టిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్ ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం, వేద పండితులు, పారాయణికులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

స్వర్ణ దివ్య విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంతోపాటు మార్చి 1న ప్రారంభమయ్యే స్వామి వారి 2025 వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సీఎంను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి స్వామివారి లడ్డూ ప్రసాదం, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, ఆలయ ఈఓ భాస్కర్‌రావు, పర్యవేక్షకులు రాజన్‌బాబు పాల్గొన్నారు.

గుట్టకు చేరుకున్న రామానుజ జీయర్ స్వామి

యాదగిరిగుట్ట స్వర్ణవిమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ కార్యక్రమం పురస్కరించుకుని వానమామలై మఠం 31 పీఠాధిపతులు మధురకవి రామానుజ జీయర్ స్వామి గురువారం యాదగిరిగుట్టకు చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకొని యాగశాలలో యాగనిర్వహణను పరిశీలించారు.

బస్సుల కోసం నిరీక్షణ

బస్సుల సంఖ్య తగ్గించడంతో ప్రయాణికుల పాట్లు

ఆత్మకూరు(ఎం) : ప్రధాన రోడ్డుపై బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

ఆలస్యంగా వచ్చిన బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి20 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో రద్దీ పెరిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు బస్సుల సంఖ్య తగ్గించడంతో వచ్చిన బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. మండల కేంద్రంలోని మోత్కూర్–భువనగిరి ప్రధానరోడ్డు వద్దకు బస్సుల కోసం ఆత్మకూరు(ఎం) పట్టణ ప్రయాణికులతోపాటు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు, ప్రజలు అధికసంఖ్యలో వస్తుంటారు. గురువారం ఉదయం 7గంటలకు కళాశాలకు వెళ్లే విద్యార్థులతోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు రెండు గంటల పాటు హైదరాబాద్ వైపుకు వెళ్లేందుకు ఎదురు చూసినప్పటికీ బస్సులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలస్యంగా వచ్చిన బస్సును ఎక్కేందుకు పోటీ పడ్డారు. బస్సుల సంఖ్యను తగ్గించడంతోపాటు సమయానుకూలంగా రాకపోవడంతో రద్దీ పెరిగి ప్రయాణం కష్టంగా మారుతున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే బస్సుల సంఖ్యను పెంచి సమయానుకూలంగా నడిపించాలని కోరుతున్నారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

గీత కార్మికుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

రాజాపేట ఫిబ్రవరి 20 : గీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ కోరారు. మండలంలోని నెమిలె గ్రామంలో తాడిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన పాల సిద్ధులు కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాలమణి, నాయకులు చింతలపూరి వెంకటరామిరెడ్డి, సంధిల భాస్కర్‌గౌడ్, గుంటి కృష్ణ, డొంకెన మహేందర్‌గౌడ్, ఎర్ర గోకుల జశ్వంత్, గుర్రం నరసింహులు, బాల కృష్ణ, పులి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో సారాన్స్ వర్క్‌షాప్

బీబీనగర్, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో డైరెక్టర్ వికాస్ భాటియా ఆధ్వర్యంలో సారాన్స్ (సిస్టమెటిక్ అనాలసిస్ అండ్ రీసెర్చ్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ నేషనల్ సైంటిఫిక్ హెల్త్)పై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ కేర్‌లో నాణ్యమైన పరిశోధన నిర్వహించడానికి ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో నాణ్యమైన క్లినికల్ మార్గదర్శకాలు అందించడానికి లక్ష్యం నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేయాలని తెలిపారు. వర్క్‌షాప్‌లో 30 మంది మెడికల్ ఫ్యాకల్టీలు వివిధ సంస్థల నుంచి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నితిన్ అశోక్‌జాన్, ఆర్.శ్యామల, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి గుట్టలో మహా శివరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు గురువారం ప్రతిక ప్రకటన విడుదల చేశారు. శివకల్యాణోత్సవంలో పాల్గొనే వారు రూ. 516, మహాశివాత్రి రోజున అభిషేకం రూ. 300, రాత్రి జరిగే శతరుద్రాభిషేకం రూ. 516, లక్ష బిల్వార్చనకు రూ. 516 చెల్లించి వేడుకల్లో పాల్గొనాలని భక్తులకు ఆలయ ఈఓ భాస్కర్‌రావు విజ్ఞప్తి చేశారు.

ఎల్ఓసీ అందజేత

బీబీనగర్, ఫిబ్రవరి 20 : మండలంలోని జైనపల్లి గ్రామానికి చెందిన జింక భాస్కర్ ఆరోగ్య సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఈఎన్‌టీ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. భాస్కర్ చికిత్స కోసం గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7.5 లక్షల ఎల్ఓసీని తల్లిదండ్రులకు అందజేశారు. నాయకులు దూడల మధుగౌడ్ ఉన్నారు.

అక్రమంగా ఇసుక డంపు.. కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 20 : పట్టణంలో గూడూరు దిలీప్‌రెడ్డి, బిట్ల నర్సిరెడ్డి అక్రమంగా ఇసుక డంపు చేసి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

స్వర్ణగిరిలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న శఠగోప రామానుజ జీయర్ స్వామి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రెండవ రోజు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిల్లిపుత్తూర్ శ్రీ మనవాళ మహాముని మఠం పీఠాధిపతి పరమహంసేత్యాది శఠగోప రామానుజ జీయర్ స్వామి పాల్గొన్నారు. గరుడపటాన్ని శాస్త్రోక్తంగా ధ్వజ స్థంభం వద్ద ఎగురవేశారు. అనంతరం సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదాన్ని అందించారు. స్వామి వారి ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం యాగశాల ప్రవేశం జరిగింది.

ఆ తర్వాత అగ్ని మథనం, అగ్ని ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో మూర్తి కుంభ మండల అగ్ని స్థాపనాది పాంచరాత్ర ఆగమోక్త పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సుమారు 4000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : డీఎంహెచ్ఓ

పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మనోహర్

రామన్నపేట, ఫిబ్రవరి 20 : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ మనోహర్ సూచించారు. మండలంలోని మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని మందుల నిల్వ, ల్యాబ్ టెస్టింగ్, పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలను పెంచాలని సూచించారు. అనంతరం ఇంద్రపాలనగరం, కక్కిరేణి సబ్ సెంటర్లను తనిఖీ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి అశ్విని కుమార్, సీహెచ్ఓ చంద్రకళ, ఆరోగ్య బోధకుడు గోపాల్, సూపర్‌వైజర్ వాణిశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి విమర్శించారు. భువనగిరిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రగల్బాలు పలికిందని, 400 రోజులైనా ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇచ్చే పరిస్థితి లేదని, సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో పేద విద్యార్థుల బాధ పడుతున్నారని చెప్పారు. పేద విద్యార్థులకు విద్య భరోసా కార్డు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ మార్పు పేరుతో అధికారంలో వచ్చిందని, కానీ ప్రజలకు ఎలాంటి మార్పు రాలేదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి, బీజేపీ నాయకులు కాసం వెంకటేశ్వర్లు పాశం భాస్కర్, జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, పడాల శ్రీనివాస్, చందా మహేందర్ పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక పురోభివృద్ధికి సహకరిస్తాం

యావాపూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

- కలెక్టర్ హనుమంతరావు

బొమ్మలరామారం, ఫిబ్రవరి 20 : రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అన్ని విధాలుగా ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని యావాపూర్ గ్రామాన్ని ఉదయం 6:30 గంటలకు సందర్శించారు. గ్రామంలో ఆకుకూరలు పండించే రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. రైతులు ఆర్గానిక్ పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. శాస్త్ర వేత్త రాజేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రైతులకు పంట దిగుబడిపై పలు సూచనలు, సలహాలు అందజేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తెరిపిస్తానని, దానికి గ్రామస్తులు సహకరించి తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తెలిపారు. ఆయన వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి రోజా, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ రావు, తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంఈఓ రోజారాణి ఉన్నారు.

తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మందుల సామేల్

మాట్లాడుతున్న మందుల సామేల్

అడ్డగూడూరు, ఫిబ్రవరి 20 : తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేయనున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. తన సొంత గ్రామమైన మండలంలోని ధర్మారంలో సామేల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాలిగౌరారం మండలం గురజాల నుంచి అడ్డగూడూరు మండల చౌళ్లరామారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మూసీలో మానాయికుంటలో రూ.25 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అడ్డగూడూరులో ఐటీఐ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తున్నానన్నారు. డి.రేపాకలో 185 ఎకరాల ప్రభుత్వ భూమికి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బునాదిగాని కాల్వకు రూ.267 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు.అడ్డగూడూరు తాసీల్దార్ నూతన భవనానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. నాయకులు నిమ్మనగోటి జోజి, నర్సిరెడ్డి, బొమ్మగాని అంజమ్మ, బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమన్న, ఇటికాల చిరంజీవి, పాశం సత్యనారాయణ, బాలెంల సైదులు, గంగయ్య పాల్గొన్నారు. అడ్డగూడూరు మండల కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా మండలంలోని చౌళ్లరామారం గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మనగోటి జోజిని ఎమ్మెల్యే మందుల సామేల్ గురువారం నియమించారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు(ఎం)ప్రధానమంత్రి బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి20 : రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో గురువారం రైతులకు, ఖాతాదారులకు బీమా పథకాలతో పాటు డిజిటల్ లావాదేవిలపై అవగాహన కల్పించారు. రైతులు బ్యాంక్ నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది స్వాతి, నీరుపా, కిరణ్‌మై, మహేశ్, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

తాను చనిపోయినా మరో ఇద్దరికి కంటి చూపు

పగిళ్ల వెంకట్‌రెడ్డి (ఫైల్)

చౌటుప్పల్, ఫిబ్రవరి 20 : తాను చనిపోయినా నేత్రాలు దానం చేసి మరో ఇద్దరికి కంటి చూపును అందించారు. చౌటుప్పల్ మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ పగిళ్ల వెంకట్‌రెడ్డి (68) ఈ నెల 19న మధ్యాహ్నం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతిచెందారు. ఆయన నేత్రాలతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నిండుతాయని భావించిన ఆయన కుటుంబ సభ్యులు నల్లగొండ లయన్స్ క్లబ్ ఐ డొనేషన్ సెంటర్ ప్రతినిధులను సంప్రదించారు. వెంటనే సంబంధిత ఐ డొనేషన్ సెంటర్‌కు చెందిన కో ఆర్డినేటర్ చిరునోముల చంద్రశేఖర్ సహకారంతో టెక్నీషియన్ జానీ మృతుడి స్వగ్రామానికి బుధవారం అర్ధరాత్రి వచ్చి రెండు నేత్రాలను సేకరించారు. దీంతో గ్రామస్తులు వెంకట్‌రెడ్డి భార్య శశిరేఖ, కుమార్తెలు కవితా రఘురెడ్డి, కల్పలామల్లారెడ్డి, కరుణారాకేశ్ రెడ్డి, దీప్తిభాస్కర్ రెడ్డిని అభినందించారు. మరణానంతరం 6–8 గంటలలోపు నేత్రదానం చేయవచ్చని ఐ డొనేషన్ కో ఆర్డినేటర్ తెలిపారు. పార్థివ దేహం ఫ్రీజర్ బాక్స్‌లో ఉంటే 12–15 గంటల వరకు కూడా తీసుకునే అవకాశం ఉంటుందని, నేత్రదానం చేసేందుకు 9948143299 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు

శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ యశోద

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 20: గర్భిణులు, పిల్లలు, కౌమార దశలో ఉన్నవారికి అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్ యశోద అన్నారు. ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అయోడిన్ లోపం, సూక్ష్మ పోషకాల ద్వారా వచ్చే వ్యాధులపై పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం మహిళా ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తినే ఆహారంలో అయోడిన్ లేకపోవడంతో గాయిటర్, క్రెటినిజం, థైరాయిడ్, న్యూరోమేటర్ లోపాలు, గర్భిణుల్లో తరుచుగా అబార్షన్లు జరుగుతాయని తెలిపారు. పిల్లలు మంద బుద్ధిగా ఉండుట, శరీర పెరుగుదల లేకపోవుట, నీరసంగా ఉండుట వంటి వ్యాధి లక్షణాలు కల్గియుంటారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు రామకృష్ణ, గ్లోబల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ ప్రవీణ్, మహిళా ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నబోయిన చెక్‌డ్యామ్

- మూణ్నాళ్ల ముచ్చటగా గోదావరి జలాలు విడుదల
- పంటలు ఎండుతున్నాయని రైతుల ఆవేదన

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి20 : మండల కేంద్రంలోని కొరటికల్–ఆత్మకూరు(ఎం) గ్రామాల మధ్య గల బిక్కేరు వాగులో నిర్మించిన చెక్‌డ్యామ్‌లోకి జనవరి 6న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గోదావరి జలాలను విడుదల చేసి అట్టహాసంగా పూజలు చేశారు. దీంతో రైతులు ఎంతగానో సంతోషపడ్డారు. కానీ ఇప్పుడు చెక్‌డ్యామ్‌లో నీళ్లు లేకపోవడంతో పొట్టదశకు వచ్చిన వరిపంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం నాలుగు రోజులు మాత్రమే చెక్‌డ్యామ్‌లోకి నీళ్లను విడుదల చేశారని, ఇప్పుడు చుక్క నీరు లేకపోవడంతో బోర్లు, బావుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. ఇప్పటికైనా వెంటనే సంబంధిత ప్రజాప్రతినిధులు స్పందించి నిరంతరం చెక్‌డ్యామ్‌లోకి గోదావరి జలాలు వదలాలని రైతులు కోరుతున్నారు.

జనవరి 6న గోదావరి జలాలతో కళకళలాడిన కొరటికల్ బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్

ప్రస్తుతం గోదావరి జలాలు రాకపోవడంతో ఎండిపోయిన చెక్‌డ్యామ్

హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలపై న్యాయపోరాటం

- యాదాద్రి రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్

మాట్లాడుతున్న యాదాద్రి రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 20 : ఫామ్ ల్యాండ్స్ కొనుగోలు చేయొద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని యాదాద్రి రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవద్దా అని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఫామ్ సైట్లను కొనొద్దని చెప్పడానికి హైడ్రాకు ఎలాంటి హక్కులేదని, దీనిపై త్వరలో న్యాయ పోరాటానికి సిద్ధమని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ కుదేలై వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. అప్పుల బాధలతో రియల్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో జీపీ లే అవుట్, ఫామ్‌ల్యాండ్‌లపైనే రియల్ వ్యాపారాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఫామ్ ల్యాండ్ కొనుగోలు చేయొద్దని చెబితే వ్యాపారస్తులు మరింత ఇబ్బందిలో పడే అవకాశం ఉందని అన్నారు. రియల్ వ్యాపారం ఎలా అభివృద్ధి చేస్తే బాగుంటుందో సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేసి వ్యాపారులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో యాదాద్రి రియల్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొకుంట్ల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సింహగౌడ్, ప్రధాన కార్యదర్శులు రేకల రాజు, ఆరె స్వామిగౌడ్, అసోసియేషన్ కార్యవర్గం పసల శ్రీను, కొంగరి శంకర్, గంగసాని నవీన్, సిలువేరు కిశోర్, ఆకుల చంద్రమౌళి, ఆలేరు గణేశ్ పాల్గొన్నారు.

డిటెన్షన్ విద్యావిధానం అమలు చేయాలి

ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న పట్టభద్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

చౌటుప్పల్, ఫిబ్రవరి 20 : రాష్ట్రంలో విద్యార్థులకు డిటెన్షన్ విద్యావిధానం అమలు చేయాలని కోరుతూ ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డికి గురువారం పట్టభద్రుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. హాజరు ప్రాతిపదికన ప్రమోట్ చేయకుండా ఉత్తీర్ణత ఆధారంగా పై తరగతులకు పంపిస్తే పిల్లలకు విద్యపై మరింత పరిజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో అన్ని పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పట్టభద్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి పాలకూర్ల మురళి గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : పల్లెర్ల ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం సోమయ్య

స్వపరిపాలన దినోత్సవం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి20 : మండలంలోని పల్లెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా విధులు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం సోమయ్య, మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు వైద్యుడిని నియమించాలని రైతుల నిరసన

పెద్దకాపర్తి పశు వైద్య కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిట్యాల, ఫిబ్రవరి 20 : మండలంలోని పెద్దకాపర్తి పశు ఆరోగ్య ఉపకేంద్రానికి వైద్యుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులు కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపకేంద్రం పశు వైద్యుడు కొన్ని నెలలుగా విధులకు హాజరు కాకపోవటంతో పశువులకు వైద్యం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఉపకేంద్రానికి పశు వైద్యుడు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చూకూరి గణేశ్, రైతులు పాల్గొన్నారు.

పోచంపల్లి బ్యాంకుకు 8 నూతన శాఖల ఏర్పాటుకు అనుమతులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 20 : పోచంపల్లి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు సంబంధించి నూతనంగా 8 శాఖలు ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు చేసిందని బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్ గురువారం తెలిపారు. భువనగిరి, నల్లగొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, నకిరేకల్, కోదాడ, బడంగ్‌పేట్, జనగాం ప్రాంతాల్లో శాఖలు ఏర్పాటు చేయనునట్లు పేర్కొన్నారు. దీంతో పోచంపల్లి అర్బన్ బ్యాంకు మొత్తం 22 శాఖలుగా మారనున్నాయని తెలిపారు. బ్యాంక్ వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలె హరిశంకర్, సూరపల్లి రమేశ్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తాల నరసింహ, బ్యాంక్ సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లు, కారోబార్‌లతో శుక్రవారం తాగునీటి సమస్యపై జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేతపంపులకు మరమ్మతులు చేయించడంతోపాటు, అద్దెబోర్లను సైతం వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్, శ్రీనివాస్‌రావు, ఎంపీఓ దినకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.